


# చెయ్యని నేరం

ఇముకపల్లి లక్ష్మినరసింహశాస్త్రి

ఇలాంటి కథలు యిప్పటికి చాలా మంది రాసేవుంటారు. అసలు నేనే రాశానేమోనని కూడా నా కనుమానం. ఇంకా రాస్తూనే వుంటారు కూడా. దీనికి కారణాలు రెండు ఒకటి మనిషికి పెట్టిన మరుపు శక్తి. అనే దేవుడిచ్చిన వరం. మరుపుశక్తి పురోభివృద్ధికి చిహ్నం. మనం యెన్నో మరిచిపోగలుగుతున్నాం కాబట్టే, ముందుచూపుతో సంతోషంగా సాగిపోగలుగుతున్నాం. అసలు మరుపుశక్తి లేకపోతే జ్ఞాపకశక్తికి ప్రాముఖ్యతే లేదు అదట్లా వుంచండి.

ఇంకా రెండో కారణం, మానవనైజం. సహజమైన లక్షణాలు, మానవ ప్రకృతి మాసిపోని ముద్రలు వీటిని చూస్తున్నప్పుడు గాని, చదువుతున్నప్పుడు గాని, వింటున్నప్పుడు గాని పొందే అనుభూతి

వర్ణనాతీతం. ఎప్పటికప్పుడు కొత్తగానూ, వింతగానూ, ఆశ్చర్యంగానూ వుంటూనే వుంటాయి. అందుకనే యెన్ని సార్లు యెంతమంది రాసినా, చదవాలనే పాఠకుల్లో ఆసక్తి తాజాగానే ఉంటుంది.

ఇది ఇప్పటి మాటకాదు. కన్నాంబ హీరోయిన్ వేషం వేసే రోజుల్నాటి సంగతి. అయినా యిది యిప్పుడు జరిగినట్లుగానే వుంటుంది.

అప్పటికింకా శ్రీధర్ పుట్టనేలేదు. ఇంకా గౌరి విషయం చెప్పేదేముంది!

ఆ రోజుల్లో ప్రభావతి అచ్చగా యిప్పటి గౌరిలాగానే వుండేది. వాళ్ళిద్దరి ఫోటోలు ప్రక్క ప్రక్కనే పెట్టి చూస్తే తల్లెవరో కూతురెవరో తెలుసుకోవటం కష్టమే అనిపించేది.

అందం ఒకళ్ల సొత్తు కాదు! అందమైన వస్తువు ఎప్పుడూ ఆనందంగానే వుంటుందనే కవి పలుకు చాలా పురాతనమైనదే. అయితే దాంట్లోని భారం కోమలంగా నవనూత్నంగా అందరి హృదయాల్లోనూ వెల్లివిరుస్తూనే వుంటుంది.

అందమనేది చూసేవాళ్ళ కళ్ళల్లోనే కాదు, ఆనందించే మనస్సుల్లో కూడా వుంటుంది.

అందంలో ఆకర్షణ వున్నట్టే, ఆకర్షణలో ఆప్యాయత పుట్టిపడుతూ వుంటుంది. ఆప్యాయతతో పాటు సానుభూతి, జాలి, అనురాగం పెనవేసుకునే వుంటాయి. ఎన్ని లక్షణాలున్నా అవగాహన లేకపోతే వాటి రాణింపు వుండదు.

అనుక్షణం అనుమానం పెనవేసుకుని, తాను చుట్టుకున్న సంకెళ్ళలో నలిగిపోతూ, ఆ బంధాన్ని తెంచుకుపోవాలని అహర్నిశలు ప్రయత్నం చేస్తూనే వుంటుంది ప్రభావతి.

లేకపోతే ఆ నాడు తహసీల్దారుగారింట్లోనూ, కాంట్రాక్టరు రామనాధంగారింట్లోనూ వంటలుచేస్తూ రెక్కలు ముక్కలు చేసుకుని బ్రతకాల్సిన అవసరం వుండేదేకాదు, అయితే అలవాటు అన్నింటికి దాసోహం చేయిస్తుంది. కొత్తలో బెరుకుగా వున్న వంటమనిషి ప్రభావతి అని పేరువచ్చిన తర్వాత అంతా మామూలుగానే నడిచిపోతోంది.

ఆమె భర్తకూడా పేరు మోసిన వంటమనిషే! ఆయన చేతి రుచి చూడాలి. ఇహ చెప్పేతరం కాదు. ఆ ఊర్లో సరేసరి. చుట్టుప్రక్కల యెక్కడైనా సరే యెలాంటి ఫంక్షన్స్ అయినా శరభయ్యగారికి కబురందాల్సిందే! శరభయ్యగారు వారంరోజుల్లోనూ ఏడు రోజులు బిజీ! ఆయన్ని ఒక్క ప్రశ్న వేస్తే చాలు సోమవారం నుంచి ఆదివారం దాకా ఎంగేజ్‌మెంట్స్ లిస్టు అంతా చదివేశేస్తాడు.

పాపం ప్రభావతి! అమాయకురాలు. భర్తను నమ్ముకున్న ఏక పతివ్రత.

అయినా ఆయనకు తీరుబడెక్కడ! కాపేపు ఎప్పుడయినా యింటిపట్టు నుంటే గురకపెట్టి నిద్రపోవటంతోనే సరిపోతుంది. ఊళ్లోంచి ఆయన బైట పడేదెప్పుడో! ప్రభావతి మెచ్చేదెప్పుడో!

ఆయనతో పాటు ఆమెను కూడా నెట్టేశాడు గాడిపొయ్యి దగ్గరకు. అపసోపాలు పడుతూ చేస్తూ వుంటుంది. సంసారపక్షంగా అక్కడ యిక్కడ చిన్నపాటి వంటలను చేసినా, ఆమె పేరు ప్రఖ్యాతులు అటూ యిటూ నిముషంలో పాకిపోయినాయి.

వంట రుచి యెట్లావున్నా ప్రభావతి చేతి వంట రుచిచూసి తీరాలోయ్ అంటూ ఆకతాయిలు అనటం కూడా కద్దు.

ఆమెది భారీ శరీరం. పమిటకొంగుతో శరీరాన్ని పూర్తిగా కప్పేసుకుని చక్రాల్లాంటి కళ్ళు నాలుగువైపులా తిప్పుతూ ఎవరేనా మగాడు కంటపడితే చప్పున ఒదిగి తన పనేమిటో తాను చూసుకుంటూ ఉండేది. అందులోనూ స్నానం చేసివస్తున్నప్పుడు మాత్రం తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకునేది.

'అమ్మగారూ యిక్కడ యెవ్వరూ లేరుగదా, రావచ్చు గదా' అంటూ మరీ మరీ అడిగి పెరటిలోంచి వంటింట్లోకి వచ్చేది.

చెప్పిన పని చెయ్యటం ఇచ్చిన డబ్బు తీసుకోవటం యీ రెంటినీ అలవాటు చేసుకుంది. అలవాటు చేశారు. చివ్వరకు రెండూ ఒక్కటే

'ఇవ్వండి ఇవ్వండి మీ యిష్టంవచ్చినట్టు. కనీస వేతనాలు యీ వంటవాళ్ళ కూడా నిర్ణయిస్తారు. అప్పుడు మీ తాళ్లు తెగుతాయి. అంతవరకు యిట్లా అడుతూనే వుంటారు....' అంటూ వో మాజీ లేబర్ లీడర్ అంటూ వుండేవాడు.

అలాంటి ప్రమాదం యిప్పటివరకు జరగలేదు. అయినా వాళ్ళూ నేర్చారు. గవర్నమెంటుకే బుద్ధిచెప్పారు. నిర్ణయించబోయే కనీస వేతనాలకు రెట్టింపు గుంజుతున్నారు.

ప్రతిరోజూ ఒక్కమాదిరిగా నడవదు. ప్రతి యింట్లోను ఒకే తీరు అనుభవం రాదు.

ఆ నాడు పెద్ద గాలివాన. ప్రొద్దున్నుంచి ఆకాశం నిర్మలంగానే వుంది. ఎండ మాడ్చేసింది కూడా. అయితే యేం ప్రొద్దుకూకే ఇప్పటికి మేఘాలన్నీ ఆకాశం అంతా కప్పేసినాయి. రివ్వున గాలి వీచటం మొదలుపెట్టింది. నిమిషాల మీద భీభత్సం అయిపోయింది.

కిటికీ తలుపులు ఫెళాఫెళా కొట్టుకోవటం, అవి వేసినా ఒక్కటే తీసి వుంచినా ఒకటే. అంగుళం మేర స్పష్టంగా కనిపిస్తూనే వుంటుంది. తలుపుల్లోంచి వానజల్లు అమాంతం వచ్చేసి, మంచాలు, మంచాల మీద పరుపులు తడిసి ముద్దయిపోయినాయి.

కృష్ణారావు చిక్కు చిక్కు మంటున్నాడు. ఈ వానొచ్చినందుకు కాదు,

గాలి వీస్తున్నందుకు కాదు, ప్రభావతి తవింట్లో చిక్కుబడిపోయినందుకు.

రాత్రి తొమ్మిది దాటింది. వచ్చిన అతిధులు భోజనాలు చేసి వెళ్ళిపోయారు. ఇక ప్రారంభమయింది వాన.

వానరాక.... ఇంకోటి యెవ్వరికీ ముందుగా తెలీదంటారు. నిజమే!

రాత్రి ఆకాశంలో మెరుపులు చూస్తూనే కృష్ణారావు గతుక్కుమన్నాడు. అప్పటికే భార్యను పురమాయించాడు. తొందరగా పనులు పూర్తి చేయించమని. సుశీల మహా బద్ధకస్థురాలు. అట్లాగే అట్లాగే అంటూ గంటలు గడిపేసింది. ఈవిడగారు యిప్పుడే తుర్రుమంటే వంటిల్లంతా యెవరు సర్దుతారు అని లోపల లోపల సణుక్కుంటూ భర్త మాటకు మాత్రం పంపిస్తున్నాను అంటూ సమాధానం చెప్పేసింది.

'నీక్కాదు చెపుతోంది' అని గట్టిగా ఆయన విసుక్కుంటే, 'ఆ శరభయ్యగారొచ్చి తీసుకుపోతాడులెండి. మీకా శ్రమక్కర్లేదు' అనేసింది.

కృష్ణారావు గతుక్కువున్నాడు.

ఈ ముక్క ప్రభావతి వినలేదని తెలుసుకున్న తర్వాత అయనకు మనశ్శాంతేర్పడింది.

అదికాదు నే అంటుంది అని ఏదో చెప్పబోతుంటే, 'అవిడ మొగుడొచ్చి తీసుకుపోతాడని చెప్పాగా ఏమిటా చిందులు....' సుశీల స్థాయి పెరిగింది.

కృష్ణారావు తగ్గాడు.

త్రాసులో సిబ్బులు మోస్తరు, ఒకటి క్రిందకువెళితే యింకొకటి పైకి వెళుతుంది. ఓ సిబ్బి పైకిలేస్తే, రెండోది క్రిందే వుండిపోతుంది. భార్యాభర్తల సంబంధం కూడా ఇంతే. ఈ సామ్యం, తనను భార్యచేతిలో ముక్కచివాట్లు తిన్న స్నేహితుడు, తాను యేవిధంగా సర్దుకుపోతోంది చెపుతూ వ్యాఖ్యానించాడు. అది గుర్తుకొచ్చింది యీ సమయంలో కృష్ణారావుకు.

కృష్ణారావు ఎంత కోపిష్టో అంత శాంతమూర్తికూడా. అయన కేవలం దురహంకారిగా కొంతమందికి కనిపిస్తే మరి కొంతమందికి చాలా సౌమ్యుడుగా సాక్షాత్కరిస్తాడు.

ప్రభావతికి మాత్రం కృష్ణారావు చాలా సౌమ్యుడనే విశ్వాసం. అయితే యీ గాలివాన వచ్చేసి ఆ విశ్వాసాన్ని పూగించేసేస్తోంది. అందుకనే ఆమెకు గుండెదడ, భయం ఎక్కువవుతున్నాయి. ఆమె ఊహ పెడదోవన పట్టటానికి కృష్ణారావు యెంత మాత్రం కారణం కాదు!

గోడగడియారం నీరసంగా గంటలు కొడుతోంది. కృష్ణారావు గుండెమీద చెయ్యి పెట్టుకుని ఒక్కొక్క గంటే లెక్క పెడుతున్నాడు.

'అయవింకా రాలేదు....' వణుకు




తున్న ప్రభావతి మాటలు ఆయనకు వినిపించినాయి.

అమాంతం గదిలోంచి ఒక అంగవేసి హాలులోకి రాబోతూ చప్పున ఆగిపోయాడు.

ప్రభావతి మండిగందగ్గర గువ్వలాగ కూర్చుంది.

'ఇంకేమొస్తాడు...' సుశీల అంటుంటే ప్రభావతి హడలిపోతోంది. ఎటూ తోచటం లేదు.

'నాకు విద్రొస్తోంది.... లోపల పడుకోండి..., అంటూ ఓ చిరుచాప ఓ దుప్పటి వంటింట్లో పడేసి సుశీల గిర్రున తన గదిలోకి వచ్చేసి, పక్క పర్దుకుంటోంది.

భార్యను చూస్తూ కొరకొరమన్నాడు

గుటకలువేస్తూ లోపలికి వెళ్లాడన్న మాటేగాని తన మనస్సంతా కలవర పడిపోతోంది.

ఈ ఫంక్షన్ యివ్వాళ్ళ వద్దు పిల్లలొచ్చిన తర్వాత పెట్టుకుందామంటే సుశీల విన్నదికాదు. ఇట్లాగే ఏదో కారణంగా దాటేస్తూ వున్నాం. ఇవ్వాళ యిది జరగాల్సిందే అంటూ పట్టుబట్టి మరీ చేయించింది. అయితే కృష్ణారావు యింత చేటుగా తపనపడటానికి కారణం లేకపోలేదు

ఇంకా వెనక్కుపోతే, కృష్ణారావు పెళ్లిచూపులకని వెళుతున్న రోజుల్లో కాబోయే పెళ్లికూతురు రూపంలో ప్రభావతిని చూసినట్టు స్పష్టంగా గుర్తుంది. కృష్ణారావుకు నచ్చింది. సరే అన్నాడు. అయితే కృష్ణారావు కూడా ఓ తల్లి వుండేది. ఆమెకు కట్నంమీద తెగ ఆశ. అప్పట్లో వరకట్న నిషేధ చట్టంలేదు. బాహటంగా తీసుకోవచ్చు. ఇప్పటి మాదిరిగా కాదు. ఇచ్చి

పుచ్చుకోవటంలో పేచీవచ్చిపడింది. ప్రభావతి తల్లి తండ్రులకు ఆర్థికస్తోమత అంతంత మాత్రంగానే వుంది కృష్ణా రావు తల్లి ఆకను వాళ్ళు తూగలేక పోయారు. దాంతో ఆగిపోయింది

అప్పట్లో కృష్ణారావు అటు తల్లి మాటకు ఎదురుచెప్పలేక, యిటు స్వతం త్రించి ప్రభావతిని పెళ్ళిచేసుకోలేక సతమతమయి, చాలా బాధపడ్డాడు.

వ్యక్తి స్వాతంత్ర్యము పూర్తిగా వున్న రోజుల్లోనే, కృష్ణారావు పరిస్థితి ఆ విధంగా తయారయింది

తర్వాత యింట్లో తెగ ఘర్షణపడ్డాడు. కొన్నాళ్ళు అసలు నే పెళ్ళిచేసుకోను అంటూ భీష్మించుకుని కూర్చున్నాడు. ఆరోజుల్లో సిద్ధాంతం ప్రకారం బ్రహ్మ చారిగా వుండటానికి వీల్లేదు. దానివలన ఒక ఆడపిల్లకు అన్యాయం చేసినవాడి వవుతావు అని పాపభీతి కలిగించి, సుశీల మెళ్లో మంగళసూత్రం కట్టించారు.

మళ్ళీ యెన్నోయేళ్ళ తర్వాత ఆ ప్రభావతి యీ రూపంలో కనిపించటం కృష్ణారావుకు ఆశ్చర్యమూ సంతోషమూ కలిగించాయి. అంతకంటే ఆమె మీద జాలి, సానుభూతి కూడా ఎక్కువయి నాయి ఈ యింటికి యిల్లాలిగా రావ ల్సినదానిని వంటమనిషిగా వచ్చావా అని వాపోయాడు. తన అభిమానాన్ని ఆమెకు తెలియపరచాలని తొందరపడుతున్నాడు.

చలి యిందాకటికంటె విసిరి విసిరి కొడుతోంది.

సుశీలైతే సుబ్రంగా రగ్గుకప్పుకొని గురకలు పెడుతోంది. కృష్ణారావుకు కంటిమీద కునుకు రావటంలేదు.

అక్కడ ప్రభావతి అంతే. కళ్ళు తెరుచుకుని మరీ మరీ చూస్తోంది, తన భర్త యెప్పుడొస్తాడా అని.

ఇప్పుడున్న రభస చాలదన్నట్టుగా ఎలక్ట్రిక్ లైట్లుకూడా పోయినాయి. ఇంట్లోనేకాదు, వాకిట్లోకూడా. అంతా చీకటిమయం.

ప్రభావతి కెవ్వున కేక పెడదామను కుని, దానికూడా భయమేసి మూగ దయిపోయింది.

కృష్ణారావుకు వళ్ళంతా కంపరం పుట్టింది.

చీకట్లో ఆవిడ ఆ వంటింట్లో ఆ చాప మీద పడుకోవటం యేమి బాగాలేదు. కాని పైకి అరవలేకపోయాడు. అయినా యిప్పుడు సుశీల నిద్రపోతోంది గదా అని, విప్పెట్టె చేతిలోకి తీసుకొని పుల్లలు గీస్తున్నాడు. వెలిగినట్టే వెలిగి తుస్సుమంటున్నాయి.

కాస్త కాంతి కనిపించటం అయన అలికిడి వినిపించటం ప్రభావతి గమని స్తూనే వుంది.

కృష్ణారావు మెల్లిగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ హాలులోకి వచ్చేశాడు. ఇహ వంటిల్లు నాలుగంగలు వేస్తే వచ్చేస్తుంది.

ప్రభావతి రెండు కళ్లూ అయన్ను

ఆ చీకట్లో స్పష్టంగా చూసినాయి. లేచి నిలబడింది. భయంతో గజగజ వణికి పోతోంది.

కృష్ణారావు వంటింటివైపు నడుస్తు న్నట్లు తెలుస్తూనేవుంది. మంటిగిందాకా వచ్చేశాడు. ఆమె పెద్దగా నిట్టూరుస్తూ మూగదయిపోయింది.

ఓరగ్గా తీసి వంటింట్లో ప్రభావతివైపు గిరాటుపెట్టి నేనే కృష్ణారావును అన్నాడు.

ప్రభావతికి ముచ్చెమట్లు పోసినాయి. కాళ్ళు వణుకుతున్నాయి. పెదిమలు తడబడుతున్నాయి.

'చలి బాగా వుంది. రగ్గుకప్పుకోండి... మీకేం భయంలేదు. మీరు ఆ ఇంట్లో యీ యింట్లో వంటలు చెయ్యాలిసి వచ్చినందుకు నేను చాలా బాధపడుతు న్నాను. మీకు జరిగిన అన్యాయానికి నేనే బాధ్యుణ్ని....

'మీ మీద నాకు యెంతో అభిమానం, గౌరవం, సానుభూతి, జాలీ అన్నీ వున్నాయి ఇవి మీకు చెప్పటానికే నేను యిప్పుడు ఇక్కడికి వచ్చాను' అంటూ కృష్ణారావు వెనక్కు తిరిగాడు.

ప్రభావతికి యేమీ అర్థంకాలేదు. మొద్దుబారిపోయి నిలబడి వుంది.

వాకిటి కిటికీలోంచి టార్చిలైటు ఫోకసు సూటిగా ప్రభావతి మొహం మీద పడింది.

అమాంతం వాకిటి తలుపు కొట్టాడు. కృష్ణారావు. గిర్రున తిరిగి తలుపు తీసాడు. శరభయ్య నిప్పులు కక్కుతూ నిలబడ్డాడు.

కృష్ణారావుకు మూర్ఛ వచ్చినంత పనయింది.

'... ఇదన్న మాట నువ్వు వంటలు చెయ్యడం....' అంటూ గబగబ లోపలికి వచ్చి ప్రభావతిని చాచి చెంప మీద కొట్టాడు.

ఆమె గిర్రున క్రింద పడింది.

ప్రభావతిని జరజర యీడ్చుకుంటూ వాకిట్లోకి తీసుకు వెళుతుంటే, కృష్ణారావు చూస్తూ విశ్చేష్టుడయిపోయాడు. ఏమీ అనలేకపోయాడు.

మళ్లీ యివాళ కూడా బాగా రాత్రయి పోయింది. ప్రభావతికి వెనకటివన్నీ గుర్తుకొస్తున్నాయి. తన కూతురు గౌరి వంటకని వెళ్ళింది – ఇంకా రాలేదు. ఇవ్వాళ అల్లుడు శ్రీధర్ కాంప్ కు వెళ్లాడు. శరభయ్య మంచంలో మూలుగుతూ పడుకొనివున్నాడు. తాను అసలు కదల్లేకపోతుంది. సంపా దించిన మూటలున్నాయి కాబట్టి, కూతురు, అల్లుడు తమ దగ్గరే వుంటు న్నారు, కాని గౌరి యింత ప్రొద్దుపోయే దాకా రాలేదు. అక్కడ యేంగొడవ జరుగుతుందో యేమో అని ఆరాటపడు తోంది.

చప్పున వాకిట్లో రిక్షా ఆగిన చప్పుడయింది.

ప్రభావతి యెట్లాగొట్లా గోడ పట్టు కుని లేచి నిలబడింది-కళ్లకు పైన కుడి చెయ్యి అడ్డంపెట్టుకుని చూట్టానికి ప్రయత్నిస్తోంది.

అవును గౌరీ అనుకుంది.

'అమ్మా!' అంటూ పెద్ద పెట్టున ఏడుస్తూ వచ్చి వళ్లోకి వరిగింది.

'ఏం జరిగింది' ... 'ఆవేశంగా అడిగింది ప్రభావతి.

'ఏమిటమ్మా! ఏమయింది....' మంచంలో పడుకొని ఆయాస పడుతు న్నాడు శరభయ్య.

'బాగా చీకటి పడిపోయింది. ఆ ప్రక్కింటి రాధ వస్తుందేమోనని చాలా సేపు కూర్చున్నాను. రాలేదు. నాకు చాలా భయం వేసింది. .. నన్ను వంటింట్లో పడుకోమని ఓ దుప్పటి యిచ్చారు. వాళ్లంతా నిద్రపోతున్నారు.

'నాకేమీ తోచలేదు. నేనేమొ హాలు లోకి వచ్చి అటూ యిటూ చూస్తుంటే విశ్వనాథంగారు తన గదిలోంచి వస్తున్నారు. నన్ను చూసి....,

చూసి .. ప్రభావతికి మూర్ఛవచ్చినంత పనయింది.

'ఏవమ్మా ఏం కావాలి అని అడిగారు ... '

'నేను యింటికి వెళతానండి ... ఇక్కడ నాకు భయంగా వుంది, అన్నాను....,

"అయితే నేను కార్లో మీ యింట్లో దిగబెడ్తి వస్తాను' అన్నారాయన. అంతే ....గౌరి వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

'ఇంతలోకి అమాంతం కమలమ్మ గారు వచ్చేసి, నన్ను నానా తిట్లు తిట్టి, యిదా నువ్వు వంట చెయ్యటం? ఎంత నంగనాచివే, ఏమీ తెలియనిదానిలాగ యిక్కడ చేరి ఆయనతో యీ అర్ధరాత్రి పూట'అవ్వ'అని నోరు నొక్కుకుందే?

'ఛీ! అవతలకుపో,'అంటూవిశ్వనాథం గారు యెంత మందలించినా ఆవిడ విని పించుకోలేదు' అంటూ గౌరి వెక్కి వెక్కి ఏడుస్తూనే వుంది.

'శరభయ్య ఆయాసపడుతూ, కాలం నాడు నేకూడా యిలాంటి తప్పే చేశా నమ్మా' అని సణుగుకున్నాడు.